అందరూ స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా



తక్కెళ్ళపాడు గ్రామంలో వర్మీకంపోస్ట్ తయారీ తీరు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

పెదకాకాని: ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కావాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో శనివారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి నెల మూడవ శనివారం ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో 33 శాతం పచ్చదనం ఉండాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. గుంటూరు జిల్లాలో కేవలం 7 శాతం మాత్రమే ఉందన్నారు. హరిత గుంటూరుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. భావి తరాలకు పచ్చదనం అందించాలని సూచించారు. పచ్చదనం ప్రాముఖ్యత గుర్తించి నాటిన ప్రతి మొక్క బతికించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించి భాగస్వాములు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా రహదారుల పక్కన, ఖాళీ స్థలాలు, కార్యాలయాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టామన్నారు. అలానే ఇంటిలోనే తడి, పొడి చెత్త వేర్వేరుగా డస్ట్‌బిన్‌లలో వేయడం, ఆ చెత్తను ఇంటి ముందు గుంటలు తీసి వేయడం ద్వారా వర్మీకంపోస్ట్ ఎరువు తయారవుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు వివరించారు. అనంతరం తక్కెళ్ళపాడు చాడేశ్వరి గ్రూపు, రామచంద్రపాలెం లక్ష్మీ గ్రూపులకు 9.80 లక్షల విలువ చేసే రెండు కిసాన్ డ్రోన్‌లను పంపిణీ చేశారు. పైరుకు పురుగుమందు పిచికారి చేయు విధానాన్ని గ్రూపు సభ్యులు వివరించారు. ముందుగా విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వాహక అధికారి కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి బీబీవనాగసాయికుమార్, మండల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత బస్సుల్లో ఉక్కిరిబిక్కిరి



ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సులో విద్యార్థుల పాట్లు

పొన్నూరు: కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం కింద మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సదుపాయం నిరాశ మిగుల్చుతోంది. ప్రయాణికులకు సరిపడా బస్సులు నడపపోవడం, కొన్ని సర్వీసుల్లో మాత్రమే ఉచిత ప్రయాణ సేవలు అందించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి ఉచిత బస్సు కిక్కిరిసిపోతోంది. బస్ పాస్‌లు ఉన్న విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వారికి ఆర్డినరీ సర్వీసులు మాత్రమే కేటాయించడంతో.. ప్రస్తుతం కిటకిటలాడుతున్న బస్సులలో ప్రయాణించేందుకు ఇబ్బంది పడతున్నారు. సాధారణ ప్రయాణికులు సైతం ఆందోళన చెందుతున్నారు. బస్టాప్ వచ్చినా దిగేందుకు ఆపసోపాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులకు సరిపడా బస్సులు వేయకుండా పథకం అమలు చేయడంపై మహిళలు విమర్శలు గుప్పించారు. కళాశాలలు, బస్‌స్టాప్‌ల వద్ద గంటల తరబడి నిరీక్షించినా బస్సుల్లో ఎక్కేందుకు వీలుకాకుండా ఇబ్బందులు పడుతున్నారు. పాసులు ఉన్నా కూడా డబ్బులు చెల్లించే బస్సుల్లో ప్రయాణం చేయాల్సి వస్తోంది.

క్లుప్తంగా

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థులకు పతకాలు



చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబరిచారు. బంగారు పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు శనివారం తెలిపారు. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన ఖేల్ ఇండియా పోటీల్లో నారాకోడూరు హైస్కూల్ విద్యార్థులు కే నాగచరిత, ఈ మిల్కీ, జీ బిందులకు బంగారు పతకాలు వచ్చాయి. జి. దైవకృప, ఎస్ తనుశ్రీ, , కే పల్లవిలకు సిల్వర్ మెడల్స్, డి పార్వతి, హవీలా, సీహెచ్ రూపిక, పి దుర్గ, భువనేశ్వరిలు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించటానికి కృషి చేసిన కోచ్ చెన్న పవన్ కుమార్ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ రిఫరీ ఆధ్వర్యంలో కోచ్ బి. వెంకట రామసాయి శిక్షణలో విద్యార్థులు బంగారు పతకాలు సాధించటంతో వారిని అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎస్ ఉమామహేశ్వరి, సీఎంఎస్ హాస్టల్ వార్డెన్ రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని ఐజీ ఎ. రవికృష్ణ పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఈగల్ టీం ఐజీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం జగదీశ్వరి, డీఎస్పీ భానోదయలతో కలిసి పాల్గొన్నారు. ఈగల్ టీం ఐజీ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలను, చట్టాలను, శిక్షల అమలు పద్ధతులను వివరించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. జగదీశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సౌత్ డీఎస్పీ జి. భానోదయ మాట్లాడుతూ కళాశాలల్లో సేఫ్ క్యాంపస్ జోన్ ఏర్పాటుకు క్లబ్‌లు స్థాపించుకోవాలని సూచించారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



పొన్నూరు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ మొహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026కు సంబంధించి 2002లో జరిగిన ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా తయారీలో ఎలాంటి పొరపాట్లు, అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన 2002లోని ఓటర్ల జాబితాలను అందజేశారు. ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాను సరి చూడాలని ఆదేశించారు. మృతి చెందిన వారి పేర్లను, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను తొలగించాలని పేర్కొన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, ఆర్ఐ రామారావు, సిబ్బంది సయ్యద్ లాల్, షేక్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సిబ్బంది సేవలు ప్రశంసనీయం



పొన్నూరు: ప్రజారోగ్య సిబ్బంది సమాజానికి వెన్నెముకలాంటి వారని, వారి సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా 2025 కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బందికి రక్తపోటు, మధుమేహం, తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు కూడా పంపిణీ చేశారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, పోషకాహారం, అంటువ్యాధుల నివారణపై సిబ్బందికి వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఫిరోజ్ ఖాన్, వైద్యులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

లక్ష్మీపురం: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శనివారం స్థానిక విద్యుత్ భవన వద్ద రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో భాగంగా కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా యూనియన్ గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నాగరాజు కూటమి తీరును ఖండించారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



న్యూట్రిషియన్ ఫుడ్‌ను పరిశీలిస్తున్న ప్రేమలత తదితరులు

లింగంగుంటపాలెం(కాకుమాను): గర్భిణులు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ పాంద్రపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ప్రేమలత అన్నారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ మహా మాసోత్సవాలు కార్యక్రమంలో మండలంలోని లింగంగుంటపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తక్కువ ఖర్చుతోసరిపడా పోషకాలు కలిగిన ఆహారాన్ని తయారీ తీరు వివరించారు. గర్భిణులకు అవగాహన కార్యక్రమంలో చేపట్టారు. ఈ సందర్భంగా ప్రేమలత మాట్లాడుతూ మన ఇంటి వద్ద లభించి, పండించే శనగ, మొక్కజొన్న, గోధుమలు ఇంతర పంటల విత్తనాలను ప్రతిరోజు నానబెట్టి మొలకలు వచ్చిన తరువాత వాటిని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాలు,ఆకు కూరలు,కోడిగుడ్డు వంటివి క్రమం తప్పకుండా తీసుకోవడం వలన గర్భిణులు మంచి ఆరోగ్యంగా ఉంటారని ఆమె తెలిపారు. ఈసందర్భంగా తక్కువ ఖర్చుతో తయారు చేసి వివిధ రకాల న్యూట్రీషియన్ ఫుడ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి



పెదకాకాని: గ్రామంలో చేపట్టిన స్వామిత్ర ప్రోగ్రాం వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. పెదకాకాని మండలంలోని పెదకాకాని గ్రామంలో జరుగుతున్న ప్రోగ్రాంను శనివారం జేసీ పరిశీలించారు. ఈ విధానం ద్వారా నివాస గృహాలను కొలవడం క్యూజీఐఎస్(క్వాంటమ్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ప్రభుత్వం కేటాయించిన సమయంలోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రమావత్ శ్రీనివాసరావు, తహసీల్దార్ పి.కృష్ణకాంత్, మండల సర్వేయర్ ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరం వద్ద వైద్యురాలు శైలజ, ప్రసన్నలక్ష్మి, సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు

చేబ్రోలు: గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి శైలజ అన్నారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో శనివారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల్లో అక్టోబర్ 2వ తేదీ వరకు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన మహిళ – శక్తివంతమైన కుటుంబం అనే నినాదంతో సమగ్ర ఆరోగ్య సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు. మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేసి వైద్య చికిత్సలు అందిస్తామని తెలిపారు. మంచాల గ్రామ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శేకూరు ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణి ప్రసన్నలక్ష్మి, సూపర్‌వైజర్ కృష్ణ మోహన్, సీహెచ్‌వో వి.కల్యాణ్, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రుల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



గోడప్రతులను ఆవిష్కరించిన ఎమ్మెల్యే నసీర్

నగరంపాలెం: సమాజ సేవ చేయాలనే ఆశయం ఉండటం అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఆర్‌అగ్రహారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. గూండా హరిప్రసాద్ ఆర్‌ఓ ప్లాంట్ అందించడాన్ని అభినందించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామని తెలిపారు. అనంతరం శ్రీ దేవీశరన్నవరాత్రుల గోడప్రతులను ఆవిష్కరించారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కమిటీలు నియమించామని ఎమ్మెల్యే అన్నారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలు 11 రోజులు రావడం ప్రత్యేకమని కమిటీ చైర్మన్ కోట శేషగిరి తెలిపారు. కార్యక్రమంలో కొనకళ్ల సత్యం, ఈరంటి వరప్రసాద్, వనమా నరేంద్ర, కారంశెట్టి లోకేష్, కాకుమాను శ్రీనివాసరావు, జూలూరి గుప్తా, కూనిశెట్టి చంద్రశేఖరరావు, కొత్తూరి వెంకట్ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు



గుంటూరు రూరల్: మండలంలోని లాలుపురం గ్రామంలో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో గ్రీన్ ఏపీ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. నీటి సరఫరా, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కళ్యాణచక్రవర్తి, జిల్లా డ్వామా అసిస్టెంట్ పీడీ శ్యామలదేవిలు స్వర్ణాంధ్ర –, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



విద్యార్థుల నృత్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా, మధురమైన కళాశాల జీవితం గడిపేలా లక్ష్య సాధన దిశగా కృషిచేయాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని లు తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో 2025 – 26 విద్యా సంవత్సర బిటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీబీఏ కోర్సులలో ప్రవేశం పొందిన మొదటి సంవత్సర నూతన బ్యాచ్ విద్యార్థిని, విద్యార్థులను స్వాగతించారు. విద్యార్థులు పాటలు, డ్యాన్స్ చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలను ఉత్సాహభరితంగా జరిపారు. కళాశాల అందించిన సదుపాయాలను వినియోగించుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ఉన్నత స్థానాలను చేరుకోవాలని, విద్యార్థులు సాధించిన విజయాలు కళాశాల ప్రతిష్ఠను మరింతగా పెంచుతాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

గుంటూరు మెడికల్: అరుదుగా ఎక్కడో.. ఎవరికో వచ్చే క్యాన్సర్ వ్యాధి, ఇప్పుడు విపరీతంగా విజృంభిస్తుందని, కారణాలేవైనా గానీ, ప్రతి ఒక్కరూ తమ జీవన విధానాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్ఎస్) చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సిహెచ్.కోటేశ్వరరావు అన్నారు. స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా గుంటూరు నగరంపాలెంలోని సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ లో 'ఆర్క' క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి సీనియర్ మెడికల్ డాక్టర్ వి.విద్య అధ్యక్షత వహించారు. డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ అదుపు తప్పిన జీవన శైలి కారణంగా తక్కువ వయస్సులోనే క్యాన్సర్లు కాటేస్తున్నాయన్నారు. డాక్టర్ వి.విద్య మాట్లాడుతూ.. అనారోగ్యకర ఆహార అలవాట్లను అందరూ వదిలించుకోవాలన్నారు. ఆర్క హాస్పిటల్ రెడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎం.హిమని మాట్లాడుతూ క్యాన్సర్ కంటే, దాని చికిత్స ప్రక్రియ చాలా బాధగా ఉంటుందనేది కేవలం అపోహ మాత్రమేనన్నారు. ఎంత త్వరగా క్యాన్సర్‌ను గుర్తిస్తే, తగ్గే అవకాశాలు అంతగా పెరుగుతాయన్నారు. అనంతరం 63 మంది మహిళలకు బ్రెస్ట్ ఎగ్జామినేషన్, పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించి, తగు జాగ్రత్తలతో పాటు, మందులు పంపిణీ చేశారు. క్యాన్సర్ శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఆర్క హాస్పిటల్ అంకాలజీ డాక్టర్లు మాకినేని హేమంత్, పవన్ రాఘవరెడ్డి, రాజు నాయుడు, హిమనిలను సీజీహెచ్ఎస్ వైద్యులు అభినందించారు. కార్యక్రమంలో సీజీహెచ్ఎస్ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి.హేమా సుందరి, ఫార్మాసిస్టులు ఆయేషా బేగం సయ్యద్, సునీల్ సిబ్బంది మురళీకృష్ణ, రామారావు, మోహన్, మక్బుల్, వెంకటేశ్వర్లు, రత్నరాజు, నందమణి ఆర్క ఆసుపత్రి ప్రతినిధులు ఆదిరెడ్డి, పవన్ కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



పొన్నూరు: 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని సిద్ధి వినాయక నగర్‌లో మొక్కలు నాటడం, టెర్రస్ గార్డెన్ నిర్వహణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మొక్కలు నాటారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, అధికారులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధుల నిర్వహణపై అవగాహన



నెహ్రూనగర్: వ్యవసాయ, వ్యవసాయేతర జీవనోపాధుల నిర్వహణపై రైతు ఉత్పత్తిదారు సంఘాలకు, మండల, గ్రామ స్థాయి డీఆర్‌డీఏ సిబ్బందికి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం అవగహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లాం ఫాం కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.యుగంధర్ మాట్లాడారు. ఆర్గానిక్ ఫార్మింగ్, మష్రూమ్, కిచెన్ గార్డెన్, గేదెలు, గొర్రెలు, పందుల పంపకం వంటి జీవనోపాధుల వలన కలిగే లాభ నష్టాలు, ఆరోగ్య ప్రయోజనాలు, ఆర్థిక, అభివృది తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ టీపీ విజయలక్ష్మి, ఏఎన్‌యూ మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ హెచ్‌ఓడీ శివరాం, పశుసంవర్ధక శాఖ జేడీ కేవీవీ సత్యనారాయణ, డీఆర్‌డీఏ ఏపీడీ ఎస్.కిరణ్‌కుమార్, ఎల్‌హెచ్ డీపీఎం డాక్టర్ టి.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

లోక కల్యాణం పథకంపై అవగహన



నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వానిధి 2.0 లోక కల్యాణం పథకాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో లోక కల్యాణం పథకంపై వీధి వ్యాపారులకు అవగాహన కల్పించారు.

బిహార్ ఓటు పరిణామాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

లక్ష్మీపురం: బిహార్‌లో ఓటు పరిణామాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం గుంటూరులోని పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్–జాషువా– ఫూలే– పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం– ఎన్నికల కమిషన్ – ఓటు పరిణామాలు అంశంపై సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బిహార్‌లో ఓటర్ల జాబితాలో జరుగుతున్నా అక్రమాలు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతమని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిగా ప్రధాన మంత్రి మోదీకి ఊడిగం చేస్తుందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ భారతదేశ 14 జాబితాలో అక్రమాలు జరుగుతే ప్రజాస్వామ్య ప్రక్రియ విఘాతం కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో చిలుకా చంద్రశేఖర్, ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, అంబేడ్కరిస్ట్ ఎస్.ప్రకాష్, చారువాక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియమ్స్, భీమ్ సేనా సేవా దళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

కోబాల్డ్‌పేటలో శానిటేషన్ డ్రైవ్

లక్ష్మీపురం: పశ్చిమ నియోజక వర్గ పరిధిలోని 35వ డివిజన్ పరిధిలో ఇటీవల భారీ వర్షానికి కోబాల్డ్‌పేట ప్రాంతంలో డ్రైనేజిల నిర్మాణం చేపట్టడంతో వర్షపు నీరు నివాస గృహాల్లోకి వచ్చిచేరింది. ఈ విషయం తెలిసిన తక్షణమే నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు వర్షపు నీటిని తొలిగించి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాణిక్యరావు పర్యవేక్షణలో ఉదయం నుంచి కోబాల్డ్‌పేట 6,7 లైన్‌లలో ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలిగించే కార్యక్రమాన్ని చేపట్టారు.

రైతు బజారులో త్వరలో శాశ్వత దుకాణాలు



గుంటూరు వెస్ట్: రైతు బజారు కోసం కేటాయించిన స్థలంలో త్వరలోనే శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేస్తామని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవత్సవ్ తెలిపారు. శనివారం స్థానిక కృష్ణనగర్‌లోని రైతు బజారులను ఆయన తనిఖీ చేశారు. కర్నూలు నుంచి వచ్చిన ఉల్లిపాయలు, టమోటా క్రయ విక్రయాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదరణ పొందిన రైతు బజారులు మరింత పటిష్టంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సహాయ మార్కెటింగ్ సంచాలకులు పి.సత్యనారాయణచౌదరి పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నెహ్రూనగర్: బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ విన్నవించారు. ఈ మేరకు శనివారం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న బీసీలకు ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ఎన్నికల వాగ్దానం చేశారని.. ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. చట్టసభలలో 33 శాతం, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు, నామినేషన్ వర్క్‌లలో 34 శాతం రిజర్వేషన్లు అమలుకు వాగ్దానం చేశారన్నారు.

ఘనంగా మహాగణపతి నిమజ్జనం



గుంటూరు రూరల్: నగర శివారు ఇన్నర్ రింగ్‌రోడ్డు రెడ్డిపాలెం సమీపంలోని శ్రీ చైతన్య స్కూల్ గ్రౌండ్‌లో 21 రోజులపాటు ప్రత్యేక పూజలందుకున్న 99 అడుగుల మహాగణపతి నిమజ్జనోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మండప కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వామికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. రాత్రికి స్వామి వారి నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. మట్టి మహాగణపతికి ఫైర్ ఇంజిన్‌ల నీటితో గ్రౌండ్‌లోనే నిమజ్జన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో భక్తులు, మండప కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ



కాకుమాను: విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఉపాధ్యాయులు వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెన్నడి అన్నారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కెన్నడి మాట్లాడుతూ పాఠశాల విద్యాభివృద్ధిలో వెనుకబడిన బి,సి గ్రేడు విద్యార్థులను గుర్తించి ప్రతిరోజు వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. బెస్ట్ ప్రాక్టీస్ ద్వారా విద్యార్థులకు బోధనలు సులభతరం చేయాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ చైర్‌పర్సన్ భాస్కర్,హెచ్‌ఎం రంగారావు,వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.